# పునర్జన్మ

మాచిరాజు కామేశ్వరరావు



సిరిపురం దట్టమైన అడవుల మధ్య కొండల్లో ఉన్న అతి చిన్నరాజ్యం. దానికి రాజు జయసింహ. జయసింహ ప్రకృతి ప్రేమికుడు. పచ్చని అడవి, చప్పుడు చేస్తూ ప్రవహించే సెలయేర్లు, జలపాతాలు స్వేచ్ఛగా తిరిగే అడవి జంతువులు... వీటన్నింటినీ చూస్తూ అంతఃపురపు సుఖాన్ని మరచి ఆ కొండలమధ్య రోజుల తరబడి గడపగలడు అతను! అందుకే అతను తరచూ ఒంటరిగా అడవి అంతా వెన్నెల రాత్రుళ్ళు తిరిగి తూర్పు తెల్లారకముందే అంతఃపురానికి చేరుకునేవాడు.

ఒకసారి అతను కొన్ని అనివార్య పరిస్థితుల రీత్యా నెల రోజులపాటు అడవి మొహం చూడలేదు. నాలుగు రోజులకు ఒకసారి అయినా ప్రశాంతంగా ఉండే పచ్చటి ప్రకృతిమధ్య ఒంటరిగా కాస్సేపు తిరిగివస్తేనే కానీ అతనికి రాజ్యభారం నుంచి సేదదీరినట్లుగా ఉండేది కాదు! అందుకే ఈ మాసం రోజులు అతను చికాకుగా అతి భారంగా గడిపాడు. ఆరోజు పున్నమి! పండువెన్నెల గవాక్షం గుండా అతని మందిరంలోకి పడుతోంది. వెన్నెల చల్లదనానికి అతనికి చిన్న కునుకు పట్టింది.

ఆ నిద్రలో ఒక అందమైన కల!

అతను అడవిలో ఎన్నడూ చూడని నదీప్రాంతంలో దారితెలియక అయోమయంగా తిరుగుతున్నాడు. అయితే అక్కడ వాతావరణం పక్షుల కిలకిలారావములతో చల్లగా వీచే సుగంధపూరితమైన గాలితో ఎటుచూసిన పచ్చని చెట్లతో అతి మనోహరంగా ఉంది! దిక్కు తోచకుండా ఉన్న అతనికి దూరంనుంచి మృదుమధురమైన కమ్మని గానం వినవచ్చింది. అతను ఆ పాట వినవచ్చిన వైపుకే వెళ్ళి నిర్ఘాంతపోయాడు.

నదీతీరంలో పెద్ద పూదోట ఉంది. అందులోనుంచి రంగురంగుల పేరు తెలియని పుష్పాలు వెదజల్లుతూన్న కలగాపులగపు కమ్మని మత్తయిన సువాసన. తోట మధ్యలో పూల కుటీరం ఉంది! విరగబూసి ఉన్న పూలను తన సుకుమారమైన చేతితో స్పృశిస్తూ తీయగా పాడుతూ తోటంతా కలియ తిరుగుతూ ఉంది ఒక అద్భుత సౌందర్యరాశి! ఆమె శరీరఛాయ గులాబీ రేకులకు బంగారపు పోత పోసినట్లుగా ఉంది! ఆమె శరీరమంతా పువ్వులతో అలంకరించుకుని ఉంది! ఆమె తలపైన ఒక పూల కిరీటం ఉంది!

ఆమె అందం జయసింహని తన్మయుడిని చేసింది! అతను చప్పున ఆమెను సమీపించబోయి ఒక పూలతీగె కాలికి తగిలి కిందపడిపోయాడు!

అతనికి నిద్రాభంగం అయిపోయింది.

అయితే చాలాసేపటివరకు ఆ పూదోట సువాసన, ఆ సౌందర్యరాశి అందం అతనిని వెన్నాడుతూనేవున్నాయి.

అడవిలో ఏ మారుమూలో తప్పక ఆ అందాలరాశి ఉండి తీరుతుందని అతనికి గాఢమైన నమ్మకం కుదిరింది!

ఆ మర్నాడు అతను తెల్లవారుతూనే ఒక తెల్లని అశ్వంమీద ఆ అందాల స్వప్నసుందరిని వెతుక్కుంటూ దట్టమైన అడవిలోకి దూసుకుపోయాడు. అయితే అతను ఈసారి తాను ఎప్పుడూ వెళ్ళని దిక్కుగా సాగిపోయాడు. ఆ వైపు అడవి జంతువులు, విషసర్పాలు హెచ్చు అని పైగా ఆవైపున పది క్రోసుల దూరంలోనే శత్రురాజ్యం సరిహద్దు ఉందని సాధారణంగా ఆవైపుకు ఎవరూ వెళ్ళరు.

అతను పిచ్చిపట్టినట్లుగా సాయంత్రం వరకూ అడవి అంతా చెడతిరిగి ఒక నదీతీరానికి చేరుకున్నాడు.

నదీతీరాన్ని చేరగానే పేరు తెలియని అడవిపూల మత్తయిన సువాసన అతడిని చుట్టు ముట్టింది. ఆ వాసన అచ్చం అతను కలలో అనుభవించినట్టిదే! జయసింహ ఉద్వేగంగా చుట్టూ కలియతిరిగాడు.

అతను ఎదురు చూస్తున్నట్లుగానే దూరంనుంచి మృదుమధురమైన గానం వినవచ్చింది. అత్రుతగా గుర్రాన్ని ఆ వైపుకు నడిపించాడు జయసింహ.

కొద్ది దూరంలోనే కలలో కనిపించిన అందమైన పూదోట కనిపించింది!

ఆ తోటలో కలియతిరుగుతూ అందమైన పూలను స్పృశిస్తూ మధురంగా గానం చేస్తున్నది ఒక అప్సరస! జయసింహ తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. ఆమె కలలో కనిపించిన దానికంటే రెట్టింపు అందంగా ఉన్నది. అంతటి అందగత్తెను అతను జన్మలో చూసి ఉండలేదు.

అతను గుర్రందిగి దానిని నచ్చిక పరచుకుని ఉన్నచోట చెట్టుకు కట్టి నిశ్శబ్దంగా తోటలోకి ప్రవేశించా డు.

అపరిచితుడిని చూడగానే ఆమె చప్పున పాట ఆపేసి "ఎవరు నువ్వు! ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అన్నది కంగారుగా!

"నేనో ప్రకృతి ప్రేమికుడిని! అందాన్ని ఆరాధిస్తూ ఇలా వచ్చాను!" అన్నాడు జయసింహ చిన్నగా నవ్వుతూ.

"వచ్చిన వాడివి ఎలాగూ వచ్చావు! రచ్చ ఏమీ జరగకముందే ఇక్కడినుంచి వెళ్ళిపో!" అన్నది ఆమె.

"అలసి వచ్చిన అతిథులకి నువ్వు ఇచ్చే ఆతిథ్యం ఇదేనా?" అన్నాడు జయసింహ విస్ఫారంగా!

పువ్వులా ఉన్న ఆమె మనసు కూడా సున్నితం కావడంతో క్షణకాలం పాటు ఆలోచనలో పడింది ఆమె.

ఆ అవకాశం కోసమే చూస్తున్న జయసింహ "దాహంతో నా గొంతు పిడచగట్టుకుని పోయింది. నిన్ను వెతుక్కుంటూ పగలంతా తిరుగుతూనే ఉన్నాను. రాత్రి నువ్వు నాకు కలలో కన్పించావు!" అన్నాడు ఆమె కళ్ళలోకి చూస్తూ.

ఆమె చూపు తప్పించుకుని "అది నా తప్పుకాదు! కుటీరంలోకి రా! నీళ్ళు ఇస్తాను!" అన్నది పూల కుటీరంలోకి వెళుతూ!

జయసింహ ఆమె వెనకనే కుటీరంలోకి ప్రవేశించాడు. లోపల అంతా పూలదండలతో పచ్చని ఆకులతో కళకళగా చల్లగా హాయిగా ఉంది. లోపల నల్లగా వికృతంగా ఉన్న ఒక మనిషినిచూసి ఉలిక్కిపడ్డాడు జయసింహ.

అతని ఒళ్ళు నల్లగా సొలుసులుగా ఉంది! చేతివేళ్ళు ఉండవలసిన స్థానంలో బలమైన ముళ్ళు ఉన్నాయి. అతను తలమీద ముళ్ళకిరీటం ధరించి ఉన్నాడు.

"అమ్మాయ్! ఇటువంటి తుమ్మెదగాళ్ళను చేరదీయడం ప్రమాదం — వెంటనే పంపించెయ్!" అన్నాడు ఆ ముళ్ళ మనిషి జయసింహను చూడగానే మొహం చిట్లిస్తూ.

"దాహంగా ఉందంటే మంచినీళ్లు ఇచ్చి పంపిద్దామని రమ్మన్నాను బాబాయ్!" అంది

పుష్పసుందరి.

"వీళ్ళను నమ్మకూడదు – నీళ్ళిచ్చి వేగిరం పంపించు" అంటూ జయసింహ మొహం చూడడం ఇష్టం లేనట్లుగా కుటీరంలో నుంచి బయటకు వెళ్ళిపోయాడు ముళ్ళమనిషి!

"అబ్బ! ఎంతటి వికృతరూపం! ఎవడీ వింతమృగం!" అని అసహ్యంగా ముళ్ళమనిషి



వెళ్ళినవైపే చూస్తూ అన్నాడు జయసింహ.

"అందాన్ని అందరూ పొగుడుతారు. వికృతరూపాన్ని అసహ్యించు కోకపోవడంలోనే మనసు మంచితనం, మనిషిగొప్పతనం బయటపడేది! ఆ వెళ్ళింది నా సంరక్షకుడు! ఆయన ఏం చెప్పినా నా మంచికే చెబుతాడు. నువ్వు మంచినీళ్ళు తాగి తక్షణం వెళ్ళిపో!" అన్నది జయసింహ చేతికి మంచినీళ్ళు ఇవ్వబోతూ.

"కేవలం నీటితోనే సరిపుచ్చుతావా? ఆకలి దహించుక పోతున్నది నాకు!" అన్నాడు జయసింహ మంచినీళ్ళు అందుకోకుండా!

ఆమె రకరకాల పళ్ళు ఉన్న పళ్ళెరం తెచ్చి అతని ముందు పెట్టింది.

జయసింహ ఏవేవో కబుర్లు చెబుతూ చిన్నగా ఒక్కొక్క పండే తినసాగాడు! అతను పళ్ళు తినడం పూర్తయ్యేసరికి చిక్కగా చీకటి పడిపోయింది.

ఇంతలో అనుకోకుండా పెద్దపెట్టున వర్షంకూడా ఆరంభం అయింది.

"తెలియని కొత్తచోటు! పెద్ద వర్షం. ఈ గాలివానలో నిర్దయగా నన్ను పొమ్మనవద్దు. ఈ రాత్రికి ఇక్కడ తల దాచుకోనీయి!" అన్నాడు జయసింహ అర్థిస్తున్నట్లుగా.

ఆమె మనసు కరిగినట్లుగా ఆమె మొహంలో భావాలే అతనికి చెప్పాయి.

కుటీరంలోకి తిరిగి వచ్చిన ముళ్ళమనిషి "ఇంకా ఈ తుమ్మెద వెధవ ఇక్కడే దాపురించాడే! వెంటనే వెళ్ళమను!" అన్నాడు కఠినంగా.

"వర్షం జోరుగా పడుతోంది కదా బాబాయ్? ఈ రాత్రికి ఇక్కడ ఉండనీయి!" అన్నది ఆమె బతిమిలాడుతూ.

"నీకు తెలియదు! ఈ విషపు పురుగు మరోక్షణం కూడా ఇక్కడ ఉండడానికి వీలులేదు" అని ఖచ్చితంగా అన్నాడు ముళ్ళమనిషి.

"నాకు ఆరోగ్యం బాగోలేదు. ఈ వర్షంలో తడిస్తే చావు భయం!" అని దీనంగా అన్నాడు జయసింహ.

ఆ మాటలకు పూర్తిగా కరిగిపోయిన ఆమె "పోనీలే బాబాయ్! అతను అంతగా బతిమిలాడుతున్నాడు. తెల్లవారగానే అతడిని పంపించేసే పూచీ నాది!" అన్నది ఆమె.

తరువాత ఆమె ఒక మూలగా జయసింహకి పూలపాన్పు సిద్ధం చేసింది.

జయసింహ దానిమీద పడుకుని నిద్ర నటించాడు. అయినా అర్ధరాత్రి వరకూ ముళ్ళమనిషి కుటీరంలో పచార్లు చేస్తూ ఆ తరువాత జయసింహ పడుకున్నట్టుగా నిర్ధారించుకుని తాను పడుకున్నాడు.

ఆ అద్భుత సౌందర్యరాశిని కలలో చూసినప్పటి నుంచే జయసింహ మనసు వశం తప్పి ఉంది! నిజంగా ఆమెను చూసిన క్షణమే ఆమెను తనదాన్నిగా చేసుకోవాలని అతడు గాఢంగా నిశ్చయించుకున్నాడు.

అయితే ముళ్ళమనిషి పెద్ద అడ్డులా అతనికి తోచాడు!

అతడు వెంటనే లేచి కత్తితో నిద్రిస్తున్న ముళ్ళమనిషి తల తెగనరికి నిద్రిస్తున్న సౌందర్యరాశిని భుజాన వేసుకుని కుటీరం దాటిపోయాడు. నిద్రాభంగం అయిన ఆమె పెనుగులాడాలని చూసింది! అయితే జయసింహ బలవంతంగా ఆమెను గుర్రంమీద కూర్చోబెట్టుకుని తూర్పు తెల్లవారక ముందే కోటను చేరాడు.

కోటను చేరిన మరుక్షణం నుంచి ఆమె పెదవి విప్పి ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఆమె ప్రాణంలేని బొమ్మలా అంతఃపురంలో విచారంగా కూర్చుని ఉండేది.

ఆమె చేత మాట్లాడించాలని జయసింహ శతవిధాల ప్రయత్నించి ఓడిపోయాడు. ఆమెను ఆనంద పరచా లని ఎన్నో వినోద ప్రదర్శనలను ఏర్పాటు చేశాడు. అయినా ఫలితం ఏమీ కనిపించలేదు.

, మాసం రోజులు గడిచినా ఆమె ప్రవర్తనలో మార్పులేదు –

అయితే రాజ్యంలో మాత్రం తీవ్ర పరిణామాలు ఏర్పడ్డాయి. చూస్తూండగానే బావుల్లోనూ, చెరువుల్లోనూ, చివరికి నదుల్లోనూ నీరు కూడా ఆవిరి అయిపోయింది. పచ్చటిచెట్లు ఎండిపోయి మోడుల్లా మిగిలాయి. రాజ్యంలో చూద్దామన్నా ఒక్క పువ్వు కూడా ఎక్కడా పూయడంలేదు! తీవ్రమైన దుర్భిక్షంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. రాజ్యంమీద గద్దలు, రాబందులు ఎగరసాగాయి.

జయసింహ మాత్రం ఇదేమీ గమనించే స్థితిలో లేదు. అ ధ్యాసంతా ఆ అందాలరాశిని ప్రసన్నం చేసుకు ఆమెను వివాహం చేసుకోవడం మీదనే లగ్నం అయిపోయింది.

"నామీద కోపం మాను! ఒక్క మాట నాతో మాట్లాడు. వచ్చే పున్నమినాడు మన వివాహం! ఈ రాజ్యానికి అడవిలో ఉండే నిన్ను తీసుకుని వచ్చి రాణీని చేస్తున్నాను. నా ఎడల కృతజ్ఞతాభావం కనబరుచు" అని రోజూ ఆమెను వేడుకునేవాడు



జయసింహ!

ఆమె పూల కిరీటంలో ఉన్న పూలు కూడా రోజుకి ఒకటి చొప్పున ఎండిపోసాగాయి. మర్నాడు పున్నమి అనగా కిరీటంలో ఉన్న ఒకే ఒక పువ్వు కూడా ఎండిపోయింది.

ఆరోజు ఆమె మళ్ళీ నోరు విప్పింది.

"నువ్వు ఏర్పాటు చేసే ప్రదర్శనలవల్ల ప్రయోజనం లేదు. నన్ను సంతోష పెట్టాలంటే నువ్వు ఒక పని చేయాలి!" అన్నది ఆమె.

ఆమె మళ్ళీ నోరు విప్పినందుకు పరమానందం చెందాడు జయసింహ – "చెప్పు. నీకోసం ఏం చెయ్యమన్నా చేస్తాను" అన్నాడు అతను ఉద్వేగంగా.

"మాట తప్పకూడదు మరి!" అన్నది ఆమె.

"ఆ అనుమానమే వద్దు!" అన్నాడు జయసింహ.

"నేను శాశ్వతంగా ఇక్కడే ఉండిపోయే ముందు ఒకసారి నా పూర్వపు తోటను, కుటీరాన్ని చూడాలని ఉంది!" అన్నది ఆమె.

"తప్పకుండా వెళదాం! ఎన్నాళ్ళుగానో అడవిలోకి వెళ్ళక నా మనసు కూడా చికాకుగా ఉన్నది!" అన్నాడు జయసింహ.

అతను అప్పటికప్పుడు ఆమెను గుర్రంమీద ఆమె పూర్వపు స్థలానికి తీసుకువెళ్ళాడు!

తోట అంతా వాడిపోయి కళావిహీనంగా ఉన్నది! గాలిలో మత్తయిన సువాసన లేదు. కుటీరం కూడా వాడిపోయిన పూలతో చిన్నబోయి ఉన్నది.

ఆ స్థితిలో ఉన్న తన నివాసాన్ని చూడగానే ఆమె కళ్ళవెంబడి జలజల నీళ్ళు రాలిపడ్డాయి.

ఆమె నిశ్శబ్దంగా కుటీరంలోకి నడిచింది.

ఆమె ఎంతకూ లోపలినుంచి రాకపోయే సరికి అనుమానం వచ్చి లోనికి వెళ్ళబోయిన జయసింహ మీదకు లోనినుంచి భయంకరమైన సుడిగాలి దూసుకువచ్చి అతని కళ్ళలో మట్టిని కొట్టి ఎటో వెళ్ళిపోయింది.

జయసింహ బాధగా మూలిగి కళ్ళు నులుముకుని లోనికి చూశాడు.

కుటీరం బావురుమన్నట్లుగా ఉంది.

లోపల అందాల పూలరాణి జాడలేదు.


జయసింహకి గుండెలు పిండినట్లయింది. ఆమె లేని నిజాన్ని అతను భరించలేకపోయాడు. అతను ఆ అడవి అంతా మారుమోగేలా పేరు తెలియని ఆమెను పిలుస్తూ కలియతిరిగి అలిసిపోయాడు.

ఇప్పుడు అతని కళ్ళకి మాడిపోయిన ప్రకృతి, క్షామ పరిస్థితి కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. నీటికోసం విలవిలలాడిపోతూ చాలాసేపు వెతికి



జ్యోతి

తల్లిదండ్రులు: భ్రమరాంబ, విశ్వనాథ్ (హైదరాబాద్)



వేసారిపోయాడు అతను.

ఎక్కడా నీటిచుక్క లేదు!

దౌడు తీసితీసి అలిసివున్న గుర్రం మరగలు కక్కుతూ పక్కకు పడిపోయింది. జయసింహ పెదవులు తడుపుకుంటూ పడుతూ లేస్తూ చాలాసేపు నడిచి ఒక పాకను చేరుకున్నాడు.

ఆ పాక ఒక కట్టెలు కొట్టేవాడిది. వాడు ఎండుకట్టెల మోపు కడుతున్నాడు. వాడి ఐదేళ్ళ కొడుకు ఎండిపోయిన అడవి తీగ నోట్లో పెట్టుకుని నీటిబుడగ ఊదుతున్నాడు.

తీగ కొడ చివర పంచరంగుల్లో మెరుస్తూన్న అందమైన బుడగ ఏర్పడింది.

దాన్ని చూసి మురిసిపోయిన ఆ కుర్రవాడు రెండు చేతులతో ఆ బుడగను పట్టుకోబోయాడు.

బుడగలేదు — వాడి చేతులమధ్య కూడా ఏమీలేదు.

అది చూసి వాడు ఏడుపు లంకించుకున్నాడు.


ఇదంతా గమనిస్తున్న కట్టెలు కొట్టేవాడు "అందాన్ని చూసి ఆనందపడాలి! అంతేకాని స్వార్థంతో దాన్ని సొంతం చేసుకోవాలనుకుంటే మిగిలేది అశాంతి, దుఃఖం. చూడబోతే నీ బుద్ధులు కూడా మన రాజుగారి బుద్ధులు లాగానే ఉన్నాయి! అడవిలో అందగత్తె కనిపించిందని ఆమెను చెరబట్టాడు. దేశాన్ని రక్షించవలసిన వాడే ఇలా ప్రవర్తిస్తే ఇక దారి ఏమిటి? అందుకే ప్రకృతి కూడా పగబట్టింది! ఈరోజే వసంతం వెళ్ళి గ్రీష్మం వచ్చింది. ఇప్పుడే కరువు పరిస్థితి ఇలా ఉంటే ముందుముందు ఎలా ఉంటుందో!" అన్నాడు తనలో తాను అనుకుంటున్నట్లుగా.

ఆ మాటలు అర్థం కాని కుర్రవాడు ఏడుస్తూనే ఉన్నాడు!

అయితే ఆ మాటలతో కళ్ళు తెరుచుకున్న జయసింహ కట్టెలు కొట్టేవాడికి రెండు చేతులూ జోడించి మొహం కనిపించకుండా తల దించుకుని "నాకు పునర్జన్మని ప్రసాదించావు. గుక్కెడు నీళ్ళిచ్చి ఆ ప్రాణాలు నిలబడేలా చేయి!" అన్నాడు.

*


చక్కని సాయం సంధ్యకి
నాంది
లూమా




లూమా ట్యూబులు, బల్బులు